క్లుప్తంగా

ప్రజా ఏక్తా పార్టీని తెలుగు రాష్ట్రాల్లో బలోపేతం చేస్తాం


రామకృష్ణారెడ్డిని అభినందిస్తున్న శ్రీనివాస్

అఫ్జల్‌గంజ్: రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రజా ఏక్తా పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లావుల రామకృష్ణారెడ్డిని నియమించారు. మంగళవారం మహారాజ్‌గంజ్‌లోని పార్టీ కేంద్ర కార్యలయంలో ఆయనకు నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ధర్మేందర్ తివారీ, పద్మజ, నరేష్ దూత్‌పాల, రాజు, ఆర్షభాయ్, అంతప్ప పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రికి రోగుల తాకిడి

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆస్పత్రి రోగులతో నిండిపోయింది. వారం రోజులుగా ఓపీ రిజిస్ట్రేషన్ విభాగం ముందు ఉదయం 7.30 గంటల నుంచే రోగులు క్యూ కడుతున్నారు. జ్వరం, ఒంటి నొప్పులు వంటివి ప్రబలడంతో ఆస్పత్రికి వచ్చే వారి సంఖ్య బాగా పెరిగింది. అయితే వారం రోజులుగా తమ ఆస్పత్రిలో ఔట్ పేషెంట్ల రిజిస్ట్రేషన్లు ప్రతిరోజూ వెయ్యి దాటుతున్నాయని ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్ ఉల్లా తెలిపారు. అయితే ఆస్పత్రిలో మందులకు ఎటువంటి కొరత లేదని ఆయన స్పష్టం చేశారు. అవసరమైన వారికి తమ ఆస్పత్రిలోనే వివిధ రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నామని ఆయన తెలిపారు.

రేపు 'మనూ'లో ప్రత్యేక ఉపన్యాసం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ది మౌలానా ఆజాద్ చైర్ (ఎంఏసీ) ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 9వ తేదీన మధ్యాహ్నం 2.30 గంటలకు సయ్యద్ హమీద్ లైబ్రరీ ఆడిటోరియంలో 'ది స్టోరీ అండ్ ప్రీ హిస్టరీ ఆఫ్ ఉర్దూ', 'దక్షిణి: ఏ హైబ్రిడ్ ల్యాంగ్వేజ్ ఆఫ్ ది బోర్డర్‌ల్యాండ్స్' అనే రెండు అంశాలపై హర్యానాలోని అశోకా యూనివర్సిటీ విజిటింగ్ ప్రొఫెసర్ డాక్టర్ పెగ్గి మోహన్ మాట్లాడతారు.

రేపటి నుంచి ప్రతిష్ఠాపన పూజలు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ కేంద్రం క్వార్టర్స్‌లోని శ్రీవీరాంజనేయ స్వామి ఆలయంలో ధ్వజ స్తంభం ప్రతిష్ఠాపన, పుప్పాలగూడ రెవెన్యూ అవతార్ టవర్స్ సమీపంలోని స్వయంభు సంకట హరణ శ్రీహనుమాన్ దేవాలయం ఆవరణలో నవగ్రహాల ప్రతిష్ఠాపన పూజలను గురు, శుక్ర, శనివారాల్లో నిర్వహిస్తున్నామని ఆయా ఆలయాల కమిటీ నాయకులు తెలిపారు. ఇందులో భాగంగా 9వ తేదీ గురువారం ఉదయం 9 గంటలకు గణపతిపూజ, గోపూజ, జపాలు, హోమాలతో పూజలు ప్రారంభమై శనివారం ఉదయం 9.18 గంటలకు ప్రతిష్ఠాపన పూజలు జరుగుతాయని, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఘనంగా శ్రీ గౌర పూర్ణిమ



బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్‌లో శ్రీ గౌర పూర్ణిమ పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడి అవతారంగా కొలిచే శ్రీ చైతన్య మహాప్రభు జయంతి సందర్భంగా ఈ వేడుకలు నిర్వహిస్తుంటారు. దీనిలో భాగంగా 56 రకాలైన వంటకాలతో ఛప్పన్ బోగ్ పేరుతో నైవేద్యం సమర్పించారు. అనంతరం శ్రీ నితాయ్ గౌరంగ్ అష్టోత్తరశత కలశ మహాభిషేకం, మహాపల్లకీ ఉత్సవం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు కీర్తనలు, భజనలు, నృత్యాలతో సందడి చేశారు.

ఉరి వేసుకుని వ్యక్తి మృతి

రాజేంద్రనగర్: ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన రాజ్‌కిషోర్(39), సుస్మిత భార్యాభర్తలు. రాజ్‌కిషోర్ ప్రైవేటు కంపెనీలో పని చేస్తూ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ లక్ష్మిగూడలో కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. మంగళవారం ఉదయం సుస్మిత తన కుమారుడితో కలిసి దేవాలయానికి వెళ్లింది. ఆ సమయంలో రాజ్‌కిషోర్ నిద్రిస్తున్నాడు. తిరిగి వచ్చే చూసే సరికి అతడు ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

హోలీ.. రంగోలీ

అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో మంగళవారం హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా అందురూ వేడుకల్లో పాల్గొని ఒకరికొకరు రంగులు పూసుకున్నారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు కాలనీలు, బస్తీల్లో కామ దహనాలు చేశారు. ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నేతలతో స్థానికులతో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. – అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల బృందం


ఎంపీ రంజిత్‌రెడ్డికి హోలీ శుభాకాంక్షలు తెలిపిన మాణిక్‌రావు


హనుమాన్ స్ట్రీట్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో..


ఛత్రినాకలో హోలీ వేడుకల్లో చిన్నారులు


వేడుకల్లో రాష్ట్ర బీజేపీ కార్యాలయ కో ఆర్డినేటర్ గోపాల్‌జీ తదితరులు


హోలీ సంబరాల్లో జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ తదితరులు


భారతీయ యోగ్ సంస్థాన్ హోలీ వేడుకల్లో వెంకటేష్, మహేష్ తివారి, సత్యనారాయణ


కామ దహనంలో పాల్గొన్న బీజేపీ నాయకుడు ప్యారసాని వెంకటేశ్ తదితరులు


ఛత్రినాక మిత్రా యువజన సంఘం ఆధ్వర్యంలో..


చార్మినార్ చౌక్ మైదాన్‌ఖాన్‌లో హోలీ వేడుకలు


మెహిదీపట్నంలో..


మహేష్‌నగర్‌లో..


రిసాలాబజార్‌లో..

మహిళలకు పెద్దపీట: ప్రొఫెసర్ విజ్జులత



సుల్తాన్‌బజార్: మహిళా దినోత్సవం వేళ తెలంగాణ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుందని తొలి తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వీసీగా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ ఎం.విజ్జులత అన్నారు. అదే కళాశాలలో ప్రిన్సిపాల్‌గా ఉన్న ఆమెను ప్రభుత్వం ఇన్‌చార్జ్ వీసీగా నియమించడాన్ని కళాశాల విశ్వ విద్యాలయం అధ్యాపకులు, సిబ్బంది స్వాగతిస్తున్నారు. తాను ఇదే కళాశాల విద్యార్థినిగా, అధ్యాపకురాలుగా, కళాశాల ప్రిన్సిపాల్‌గా విద్యార్థుల సాదకబాధకాలు తెలుసున్నారు. విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, ల్యాబ్‌లు, ఆట స్థలాలు, అధ్యాపకులు, సిబ్బంది ఇతరాత్ర అవసరాలపై ప్రభుత్వానికి నివేదిక పంపించామని వీసీ విజ్జులత 'సాక్షి'తో తెలిపారు. తెలంగాణలో మహిళా విశ్వ విద్యాలయంలో పెనుమార్పులు తీసుకువచ్చేలా కృషి చేస్తున్నామని విద్యార్థులకు విద్యతో పాటు విజ్ఞానం కలిగేలా అధ్యాయనాలు చేసేలా ప్రోత్సహిస్తామని ఆమె తెలిపారు. రాష్ట్రంలోనే మహిళా విశ్వ విద్యాలయాన్ని ఎంతో పేరుగాంచే విధంగా తీర్చిదిద్దుతామని ఆమె అన్నారు. ఇప్పటికే ఈ కళాశాలలో ఎంతో మంది విద్యార్థులుగా ఉన్న వారు సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్నారని, వారి ప్రోత్సహం కూడా మాకు ఉందన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమె మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎల్లంకి అనిల్‌కుమార్ సేవలు ఎనలేనివి


అనిల్‌కుమార్‌ను సన్మానిస్తున్న తెలంగాణ మేధావుల ఫోరం సభ్యులు

అఫ్జల్‌గంజ్: ప్రజా సంక్షేమానికి కృషి చేస్తూ అనాథ పిల్లల ఉన్నత చదువులకు ఆర్థిక సాయం చేస్తున్న ఎల్లంకి అనిల్‌కుమార్ సేవలు వెలకట్టలేనివని తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రాజ్ నారాయణ్ ముదిరాజ్ అన్నారు. మంగళవారం నానక్ రామ్ డిగ్రీ, సైన్స్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. అనంతరం అఫ్జల్‌గంజ్‌లోని ఫోరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 30 ఏళ్లుగా మెల్బోర్న్ యునివర్సిటీ అడ్మినిస్ట్రేటర్‌గా విధుల నిర్వహిస్తున్న ఎల్లంకి అనిల్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు.

దేశపతి శ్రీనివాస్‌కు సన్మానం


దేశపతి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న తూంకుంట అరుణ్‌కుమార్ తదితరులు

అబిడ్స్: ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపికైన కవి గాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు దేశపతి శ్రీనివాస్‌ను గ్రేటర్ బీఆర్ఎస్ నాయకుడు, రాష్ట్ర కురుమ యువజన సంఘం అధ్యక్షుడు తూంకుంట అరుణ్ కుమార్ మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌లో అందరికీ సీఎం కేసీఆర్ తగిన ప్రాధాన్యమిస్తున్నారన్నారు. దేశపతి శ్రీనివాస్‌ను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేయడం పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వికాస సమితి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల దినకర్, బొమ్మరాజు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

భారత్ సూపర్ పవర్‌గా ఎదగడానికి సమష్టి కృషి అవసరం



రాయదుర్గం: పర్యావరణ వ్యవస్థలను పరిరక్షించేందుకు, అభివృద్ధి చేసేందుకు విద్యాసంస్థలు తోడ్పడాలని నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వీకే సారస్వత్ సూచించారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 'ఎస్పైర్' సంస్థ 5వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా మంగళవారం నిర్వహించారు. ఫౌండేషన్ లెక్చర్ కార్యక్రమంలో భాగంగా 'ఇండియాస్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఎకోసిస్టమ్' అనే అంశంపై ఆయన మాట్లాడుతూ భారతదేశం సూపర్ పవర్‌గా ఎదగడానికి ఉత్పత్తి ఆధారిత లోతైన సాంకేతిక ఆవిష్కరణల అభివృద్ధి, స్టార్టప్‌లు, పర్యావరణ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు సమష్టి కృషి అవసరమన్నారు. హెచ్‌సీయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బీజేరావు మాట్లాడుతూ హెచ్‌సీయూ క్యాంపస్‌లో, చుట్టుపక్కల ఉన్న వ్యవస్థాపక పర్యావరణ వ్యవస్థను పెంపొందించడంలో ఎస్పైర్ ప్రయత్నాలను ప్రశంసించారు. అనంతరం ఎస్పైర్ ఇంక్యుబేటర్‌లో ఏర్పాటు చేసిన స్టార్టప్‌లను వారు పరిశీలించారు.

డివిజన్ అభివృద్ధికి నిరంతర కృషి

గోల్కొండ: నానల్‌నగర్ డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన డివిజన్‌లోని అల్‌హస్నాత్ కాలనీ, నిజాం కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో కలిసి తాను చేస్తున్న అభివృద్ధి గురించి వివరించారు. నిజాం కాలనీకి వరద ముంపు తప్పించడానికి ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ సహకారంతో రూ.కోటి వ్యయంతో బాక్స్ టైప్ డ్రైనేజీ పనులు చేయిస్తున్నామన్నారు. అంతేకాకుండా అన్ని ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లకు ప్యాచ్ వర్కులు చేయించడం జరిగిందన్నారు.

రేపు, ఎల్లుండి నీటి సరఫరా బంద్

బంజారాహిల్స్: గోదావరి పైప్‌లైన్ మరమ్మతుల కారణంగా ఈ నెల 9, 10 తేదీల్లో నీటి సరఫరా ఉండదని, ఆ రెండు రోజులూ నీటిని పొదుపుగా వాడుకోవాలని జలమండలి సిబ్బంది గత రెండు రోజులుగా కాలనీలు, బస్తీల్లో ముమ్మర ప్రచారం చేస్తున్నారు. జలమండలి డివిజన్–6 పరిధిలోని ఉమానగర్, మెథడిస్ట్ కాలనీ, సోమాజిగూడ, ఆజంనగర్ బస్తీ, ఎస్పీఆర్‌హిల్స్, యూసుఫ్‌గూడ, ఎల్ఎన్ నగర్, ఎల్లారెడ్డిగూడ, నేతాజీనగర్, ఎర్రగడ్డ, బి.శంకర్‌లాల్ నగర్ తదితర ప్రాంతాల్లో మంచినీటి సరఫరా ఉండదని జలమండలి జీఎం హరిశంకర్ వెల్లడించారు. ఇందుకు సంబంధించి సెక్షన్ మేనేజర్లు, లైన్‌మెన్లు, సిబ్బంది ఆయా ప్రాంతాల్లో మైకుల ద్వారా ప్రజలను అప్రమత్తం చేస్తున్నారన్నారు.

మహిళా గ్రూప్‌లకు ప్రత్యేక కార్యక్రమాలు: డీఎంసీ


రజనీకాంత్‌రెడ్డి

బంజారాహిల్స్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మంత్రి కేటీఆర్ సూచనల మేరకు జీహెచ్ఎంసీ సర్కిల్–18 పరిధిలో మహిళా గ్రూపులను మరింత చైతన్య పర్చేందుకు ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని డీఎంసీ రజినీకాంత్‌రెడ్డి వెల్లడించారు. ఈ నెల 8న సర్కిల్ పరిధిలో మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. 9న మహిళా సంఘాల సభ్యులకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు, 10న సీఎంటీసీలో హెల్త్ క్యాంప్‌తో పాటు ఏదైనా కమ్యూనిటీ హాల్‌లో మహిళలకు ప్రత్యేకంగా కంటి వెలుగు శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. 11న వివిధ రంగాల్లో రాణించిన మహిళలతో మహిళా సాధికారతపై మహిళా సంఘాలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ నెల 12న మహిళలు తయారు చేసిన ఉత్పత్తులతో కేబీఆర్ పార్కు వద్ద స్టాళ్లు ఏర్పాటు చేస్తామన్నారు. 13న రుణాలు సక్రమంగా చెల్లించిన మహిళా గ్రూపులకు బ్యాంకులచే సన్మానంతో పాటు కొత్తగా రుణాలు మంజూరైన గ్రూపులకు చెక్కులు పంపిణీ ఉంటుందన్నారు. 14న సీఎంటీసీలో మహిళలకు ఇండోర్‌గేమ్స్, 15న సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని డీఎంసీ రజినీకాంత్‌రెడ్డి తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు


ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు తక్షణమే చర్యలు తీసుకుంటున్నామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన నానల్‌నగర్ డివిజన్‌లోని హకీంపేట్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా ప్రాంతాల వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాగా వేసవి ఎండలు తీవ్రం కాకముందే నల్లాలో నీటి సరఫరా తగ్గిందని పలువురు ఆయనకు ఫిర్యాదు చేశారు.

భక్తిశ్రద్ధలతో షబ్బే బరాత్


గోల్కొండలో విద్యుత్ దీపాలతో అలంకరించిన ఓ మసీదు

గోల్కొండ: షబ్బే బరాత్ ప్రార్థనలు మంగళవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మెహిదీపట్నం, అహ్మద్‌నగర్, గోల్కొండ తదితర ప్రాంతాల్లోని మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆల్ ఇండియా ఖీరత్ కమిటీ అధ్యక్షుడు, కుతుబ్‌షాహీ జామా మసీదు ఖతీబ్ మౌలానా ఖారీ సయ్యద్ మతీన్ అలీషా ఖాద్రి గోల్కొండ రిసాలబజార్‌లోని మసీదులో జరిగిన షబ్బే బరాత్ ప్రార్థనలకు నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షబ్బే బరాత్‌కు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయన్నారు. టోలిచౌకి జామా మసీదు, అహ్మద్‌నగర్ బిలాల్ మసీదు, మెహిదీపట్నం జామా మసీదులలో అర్ధరాత్రి వరకు ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. షబ్బే బరాత్ పండుగ సందర్భంగా గులాబీ పూలు, గులాబీ పూరేకులు బాగా అమ్ముడయ్యాయి.

9న భారతీయ శాస్త్రీయ నృత్య సంగీత రీతుల పరిశోధనాత్మక ప్రసంగం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ కె.వి.రమణాచారి, చిత్రంలో విజయకుమార్, సుధామాల

నాంపల్లి: భారతీయ శాస్త్రీయ నృత్య సంగీత రీతుల పరిశోధనాత్మక ప్రసంగ పరంపర కార్యక్రమాలు, యువ కళాకారులకు ప్రబోధాత్మకంగా, ప్రయోగాత్మకంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి ఆకాంక్షించారు. నవ్య నాటక సమితి 65వ వార్షికోత్సవం పోస్టర్ ఆవిష్కరణ సభ మంగళవారం ఏసీ గార్డెన్స్‌లోని నఫీజ్ రెసిడెన్సీలో జరిగింది. ఈ కార్యక్రమానికి కె.వి.రమణాచారి హాజరై పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. నవ్య నాటక సమితి సమన్వయకర్త సుధామాల మాట్లాడుతూ.. ఈనెల 9న గురువారం సాయంత్రం 5.30 గంటలకు సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయంలో భారతీయ శాస్త్రీయ నృత్య సంగీత రీతుల పరిశోధనాత్మక ప్రసంగ పరంపర ఉంటుందని పేర్కొన్నారు. ప్రముఖ నృత్య గురువు, న్యూజెర్సీ, అమెరికా డాక్టర్ కాళ్లకూరి ఉమా వైజయంతిమాల ప్రసంగకర్తగా హాజరవుతున్నట్లు వివరించారు. ముఖ్యఅతిథిగా కె.వి.రమణాచారి, గౌరవ అతిథులుగా ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డిప్యూటీ డైరెక్టర్ వసుంధర, సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత కళాకృష్ణ హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ సభలో నృత్య గురువులు గీతా గణేశన్, రేణుకా ప్రభాకర్, స్నేహా రాంచందర్, నవ్య నాటక సమితి అధ్యక్షుడు విజయకుమార్, బి.వి.నారాయణరావు, చక్రపాణి, హరినాథ్ పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం


శీలం సరస్వతిని సన్మానిస్తున్న మహిళలు


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేర్ ఆస్పత్రి వైద్యులు

సుల్తాన్‌బజార్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ నగర నాయకురాలు శీలం సరస్వతి ఆధ్వర్యంలో మంగళవారం మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో కృషి చేసిన మహిళలను సన్మానించారు. సరస్వతి మాట్లాడుతూ.. మహిళా అభ్యున్నతికి తెలంగాణ ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందన్నారు. నాగమణి, అనిత, కల్యాణి, ఉమారాణి, అర్చన, మంజుల తదితరులు పాల్గొన్నారు.

కేర్ ఆస్పత్రిలో..

గన్‌ఫౌండ్రీ: ఎంజేమార్కెట్‌లోని కేర్ ఆస్పత్రిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పిస్తూ రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. డాక్టర్ సయిస్తా హుస్సేని, సయ్యద్ హుస్సేన్, డాక్టర్ సీమా సునిల్, డాక్టర్ శైలజ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ చిరు ధాన్యాలు తీసుకోవాలి


కార్యక్రమంలో ప్రముఖ చిరు ధాన్యాల నిపుణులు పద్మశ్రీ డాక్టర్ ఖాదర్ వలీ తదితరులు

సంతోష్‌నగర్: అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరం –2023 సందర్భంగా చిరు ధాన్యాలు వాటి ప్రయోజనాలపై ఎస్టేట్ మేనేజ్‌మెంట్ (ఆర్ అండ్ డీ) హైదరాబాద్ కంచన్‌బాగ్‌లోని డీఆర్‌డీఓ ఆడిటోరియంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మారుతున్న కాలంలో ప్రజల జీవన ప్రమాణాలు, ఆరోగ్యం అనే అంశాలు ఆహారంపై ఆధారపడి ఉన్నాయని ఈ సందర్భంగా ప్రముఖ చిరు ధాన్యాల నిపుణులు పద్మశ్రీ డాక్టర్ ఖాదర్ వలీ (భారతదేశపు మిల్లెట్ మ్యాన్) గుర్తుచేశారు. ఆరోగ్యమే మహాభాగ్యం అన్న నానుడి ప్రజల్లో ఇప్పుడిప్పుడే తెలిసి వస్తుందని.. కరోనా తరువాత ప్రజల్లో ఈ ఆలోచన కాంక్ష పెరగడం మంచి పరిణామమని ఖాదర్ వలీ కొనియాడారు. ఆరోగ్యాన్ని దెబ్బతీసే పలు రకాల రుగ్మతలను నివారించుకొని ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడపటానికి ప్రతి ఒక్కరూ చిరు ధాన్యాలు తీసుకోవాలని సూచించారు. చిరు ధాన్యాల ప్రాధాన్యతను తెలిపేందుకు తెలుగు రాష్ట్రాల్లో ఈ పాటికే ఎన్నో కార్యక్రమాలతో ప్రజలను చైతన్యం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలు, ఉద్యోగులు, కుటుంబసభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రైతు నేస్తం ద్వారా స్టాల్స్ నిర్వహింబడ్డాయి. సరసమైన ధరకు మిల్లెట్లను విక్రయించారు. ఈ కార్యక్రమానికి డీఆర్‌డీఓ డైరెక్టర్ జి.శ్రీనివాస మూర్తి, ఎస్టేట్ మేనేజర్ డాక్టర్ షేక్ గౌస్ మోహీద్దీన్, రైతు నేస్తం చైర్మన్ పద్మశ్రీ వెంకటేశ్వర్ రావులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్


పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

గౌలిపురా: అక్రమంగా ఇంట్లో మద్యం నిలువ చేసి విక్రయిస్తున్న ఓ మహిళతో పాటు వ్యక్తిని భవానీనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.2 లక్షల విలువ చేసే మందు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ మహ్మద్ అంజద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. లలితాబాగ్ సరస్వతీనగర్‌కు చెందిన లలిత తన సోదరుడు దొడ్డి మధుతో కలిసి ఇంట్లో అక్రమంగా మద్యం నిలువ చేసి విక్రయిస్తుంది. దీనిపై విశ్వసనీయమైన సమాచారం అందుకున్న భవానీనగర్ పోలీసులు మంగళవారం తెల్లవారుజామున లలిత ఇంటిపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో లలిత, మధులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 12 కాటన్ల బడ్‌వైజర్ బాక్స్, కింగ్‌ఫిషర్, నాకౌట్ 55 కాటన్లు, 12 బ్లెండర్‌స్ప్రైడ్ బాటిళ్లు, 48 ఇంపీరియల్ బ్లూ బాటిళ్లు, 24 బ్రీజర్లు, 30 మెక్డస్ హౌజ్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భవనం పైనుంచి పడి వ్యక్తి మృతి

గోల్కొండ: భవనంపై నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. హకీంపేట్‌కు చెందిన నర్సింహులు(53) పది రోజులుగా నదీంకాలనీలోని ఓ ఇంటికి కూలీకి వెళ్తున్నారు. ఇంటి మరమ్మతుల కారణంగా ఆ ఇంట్లో ఎవరూ ఉండడం లేదు. ఈనెల 5వ తేదీ రాత్రి నుంచి నర్సింహులు ఇంటికి రావడంలేదని అతడి కుటుంబసభ్యులు సోమవారం రాత్రి గోల్కొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం నదీం కాలనీలోని ఇంటి పక్కన ఓ వ్యక్తి మృతదేహం ఉందని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో అది తప్పిపోయిన నర్సింహులు మృతదేహమేనని తేలింది. భవనం మొదటి అంతస్తు నుంచి పడి నర్సింహులు మృతి చెందినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉంది.